


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

| RNI APTEL 2013/54510 |








Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి - 14 | సంచిక - 302 | పేజీలు - 08 | వెల - 05/- | గురువారం 29-10-2026


## ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించటమే
# లక్ష్యంగా పనిచేశాం

**-ఆర్టీజీఎస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు**

- అధికార యంత్రాంగం, సిబ్బంది వేగంగా స్పందించారు
- బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తాం
- తుఫాన్ నష్టంపై కేంద్రానికి రేపు ప్రాథమిక నివేదిక
- సహాయక చర్యల్లో సాంకేతికతతో సత్ఫలితాలు



అమరావతి, అక్టోబరు 28: అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ, మూడు రోజుల్లో ఏడు సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా తుఫాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం విశ్రాంతి తీసుకోదని స్పష్టం చేశారు.

మిగతా 2లో

# తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

● ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను ● విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం ● ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ● విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ ● తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి ● ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం



అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి,

మిగతాది 2లో

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

**నవంబర్ 1న ఢిల్లీలో ఆందోళన**

**అర్హుల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి**

**అంబేడ్కర్ సమాన ఓటు హక్కును ప్రస్తావించిన పార్టీ**



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి చేపట్టనున్న ఆందోళనకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) మద్దతు ప్రకటించింది. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరగనున్న

మిగతాది 2లో

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది!

**మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్**

**కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ**



మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.

మిగతాది 2లో

## అర్నబ్ తుపానుతో ఇప్పటికే
# కుండపోత..

● అర్నబ్ తుపాను ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు ● రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ● కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ● తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో బలమైన గాలులు ● పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు



2

అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# జియో ఐపీఓ బ్లాక్‌బస్టర్..

2లో




## ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
# వాయిదా..

- ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్
- నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు

ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది.



2

# ప్రగతిపై ప్రధాన

## మంత్రి నరేంద్ర మోడి సిఎస్ లతో వీడియో సమావేశం




అమరావతి, అక్టోబరు 28:వివిధ ప్రగతి ప్రాజెక్టులను వేగవతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు.ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే కనెక్టివిటీ,పిఎం ఏక్తా మాల్స్,బల్క్ డ్రగ్ పార్కుల

మిగతాది 2లో



2

**పులివెందుల ఓటమిని జీర్ణించుకోలేకే**

# జగన్ సవాళ్లు

**ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ హింసను రెచ్చగొడుతున్నారన్న సత్యకుమార్**

**నామినేషన్లప్పుడు కనిపించకుండా, ఇప్పుడు సవాళ్లు విసురుతున్నారని విమర్శ**

**ప్రజాస్వామ్యవాదిగా మారాలని జగన్‌కు హితవు**

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటా, ఎవరొస్తారో రండి చూస్తానంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడప జిల్లాలో, ముఖ్యంగా పులివెందులలో నామినేషన్ల ప్రక్రియ

## ఆర్నాబ్ తుఫానుతో
# రైతులకు తీవ్ర నష్టం..

**ఆదుకోవాలని కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ**

● రాష్ట్రంలో 2.24 లక్షల హెక్టార్లలో నీటమునిగిన, దెబ్బతిన్న పంటలు ● 14 జిల్లాల్లో సుమారు 3.45 లక్షల మంది రైతులపై తుఫాను ప్రభావం ● ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు పెట్టుబడి రాయితీ అందించాలని విజ్ఞప్తి ● సమగ్ర నష్ట నివేదిక అందేలోపే ముందస్తుగా కేంద్ర నిధులు విడుదల చేయాలని అభ్యర్థన



అమరావతి, అక్టోబర్ 28:ఎ ఆర్నాబ్ అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతినడంతో సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు ప్రాథమిక నివేదికల ద్వారా వెల్లడైందని తెలిపారు. పంటలు చేతికందే కీలక సమయంలో ప్రకృతి విపత్తు సంభవించడం రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్టోబర్ 28 తెల్లవారుజామున యానాంకు దక్షిణంగా

మిగతాది 2లో

# ఆర్నాబ్ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం..

## ఆదుకోవాలని కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ

తెల్లవారుజామున యానాంకు దక్షిణంగా ఆంధ్రప్రదేశ్--యానాం తీరాన్ని దాటిన ఆర్నాబ్ తుఫాను గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులకు కారణమైందని మంత్రి వివరించారు. తీరం దాటే సమయంలో తుఫాను దాదాపు స్థిరంగా కొనసాగడంతో కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయన్నారు. రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 317 మండలాల్లో 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు విస్తరించిన 16 జిల్లాల్లోని 325 మండలాల్లో 315 మండలాలు ఈ పరిధిలో ఉన్నాయని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో సగటున 236.7 మి.మీ., విజయనగరంలో 212.1 మి.మీ., అనకాపల్లిలో 209.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, విశాఖ జిల్లా గోపాలపట్నంలో అత్యధికంగా 323.2 మి.మీ. వర్షం కురిసిందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోనూ భారీ వర్షాల కారణంగా పంటలు నీటమునిగాయని వివరించారు.

వరి పంటకే అత్యధిక ప్రభావం.. డెల్టా రైతులకు తీవ్ర నష్టం

ప్రాథమిక అంచనాల ప్రకారం 154 మండలాల్లో 2,11,726 హెక్టార్ల వ్యవసాయ పంటలు నీటమునగడం లేదా దెబ్బతినగా, ఇందులో వరి విస్తీర్ణమే 2,09,460 హెక్టార్లు ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ పంటలకు సంబంధించి 3,18,704 మంది రైతులు, ఉద్యాన పంటలకు సంబంధించి మరో 25,914 మంది ప్రభావితమయ్యారని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 76,176 హెక్టార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో 44,232, కాకినాడలో 42,222, తూర్పుగోదావరిలో 29,866, కృష్ణాలో 22,339, బాపట్లలో 4,032 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ప్రభావితమైనట్లు వివరించారు. అలాగే విజయనగరంలో 1,967 హెక్టార్లు, అనకాపల్లిలో 1,624, గుంటూరులో 570, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 422, శ్రీకాకుళంలో 374, పోలవరంలో 310, ఏలూరులో 274, విశాఖపట్నంలో 81 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 82 శాతం, కోనసీమలో 75 శాతం, కాకినాడలో 48 శాతం వరి విస్తీర్ణం నీటమునిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వరి గింజ దశ నుంచి కోత దశకు చేరుకున్న తరుణంలో తుఫాను సంభవించడంతో పంటలు నేలకొరగడం, ధాన్యం మొలకెత్తడం, రంగు మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. ఇప్పటికే కోసిన ధాన్యానికి సైతం నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

లిఅరటి, కొబ్బరి, కూరగాయల పంటలకూ తీవ్ర దెబ్బలి

రాష్ట్రవ్యాప్తంగా 12,763 హెక్టార్లలో ఉద్యాన పంటలు ప్రభావితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. బలమైన గాలులకు అరటి తోటలు నేలకొరిగాయని, ముఖ్యంగా గెలలు వేసి కోతకు సిద్ధంగా ఉన్న మొక్కలు విరిగిపోవడం లేదా వేళ్లతో సహా కూలిపోవడంతో రైతులకు గణనీయమైన నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూరగాయల తోటల్లో నీరు నిలిచిపోవడం వల్ల మొక్కలు వాడిపోవడం, వేర్లు కుళ్లిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని తెలిపారు. పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో కొబ్బరి తోటల్లో మట్టలు విరిగిపోవడం, పిందెలు, కాయలు రాలిపోవడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయని వివరించారు. బొప్పాయి, పూలు, తమలపాకు తోటలకు కూడా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు.

లివర్షాలు తగ్గిన వెంటనే సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలనలి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలు ప్రాథమికమైనవేనని, వర్షాలు తగ్గి వరద నీరు పూర్తిగా తొలగిన తర్వాతే వాస్తవ పంట నష్టాన్ని నిర్ధారించగలమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు ప్రభావిత గ్రామాల్లో సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి నష్టాన్ని అంచనా వేస్తారని తెలిపారు. ఆ వివరాలతో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామన్నారు. వర్షాలు, బలమైన గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో నష్టం మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. తుఫాను ముప్పును ముందుగానే గుర్తించి రైతులను అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల వారీగా 1.05 కోట్లకు పైగా ముందస్తు సూచనలు జారీ చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందిని క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసి, పంటల సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలను తెలియజేయడంతో పాటు రైతులకు సహాయ సహకారాలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టాన్ని తగ్గించడం, రైతుల జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

లికేంద్రం తక్షణమే స్పందించాలి.. ముందస్తు నిధులు విడుదల చేయాలిలి

తుఫాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (చీణ=ఖీ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ాణ=ఖీ) నిబంధనల మేరకు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ అందించేందుకు కేంద్ర సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర నష్ట నివేదిక సమర్పణకు ముందే అత్యవసర సహాయక చర్యల కోసం ముందస్తుగా నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు. సకాలంలో ఆర్థిక సహాయం అందితే రైతుల కష్టాలను కొంతవరకు తగ్గించడంతో పాటు వారి జీవనోపాధిని పరిరక్షించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు వీలవుతుందని వివరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి అండగా నిలవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన లేఖలో కోరారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి ,అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి- మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబర్ 28, పల్లెవెలుగు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు ,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా





నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీలదే కీలక పాత్ర అన్నారు.ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ,ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు.ప్రజలు చూపిన ఆదరణ, నమ్మకాన్ని బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పదవికి లభించిన గౌరవం మాత్రమే కాదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యతను మరింత పెంచుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు.గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల అవసరాలను గుర్తించి అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోష్ర అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తోందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం, గ్రామీణ మౌలిక వసతులతో పాటు పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు . ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేలా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు వారధిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె, సంజామల, కొలిమిగుండ్ల ,కోవెలకుంట్ల జడ్పిటిసి సభ్యులు బురానుద్దీన్, బెలుం వరలక్ష్మి, నంద్యాల రమాదేవి, గడ్డం నారాయణమ్మ నాయకులు గుండం మల్లికార్జున రెడ్డి రాయలసీమ సలాం, నంద్యాల రామేశ్వర రెడ్డి, మూలే రామేశ్వర రెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

# ప్రగతిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సిఎస్ లతో వీడియో సమావేశం

(మొదటి పేజి తరువాయి)

కనెక్టివిటీ,పిఎం ఏక్తా మాల్స్,బల్క్ డ్రగ్ పార్కుల అభివృద్ధి,పియం సేతు సహా ఐటిఐ ఇకోసిస్టమ్ వంటి ప్రగతి అంశాలపై బుధవారం ఆయన ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం ద్వారా ఆయా ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించారు.వివిధ ప్రగతి ప్రాజెక్టలను సకాలంలో పూర్తి చేసే విధంగా రాష్ట్ర పభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రధాని కోరారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ఎర్రుపాలెం-అమరావతి-నంబరు రైల్వే లైనుకు సంబంధించిన ప్రగతని సమీక్షిస్తూ ఈరైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వర్వితగతిన పూర్తి చేసి రైల్వేకు అప్పగించాలని సిఎస్ సాయి ప్రసాద్ ను ఆదేశించారు.అదే విధంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిఎస్ ను ఆదేశించారు.తదుపరి విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న పియం ఏక్తామాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడి సమీక్షించారు. ఈవీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఎర్రుపాలె-అమరావతి-నంబూరు రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నవంబరు,డిశంబరు మాసాల్లో పూర్తి స్థాయిలో భూసేకరణ పూర్తి చేసి అప్పగించడం జరుగుతుందని ప్రధానికి వివరించారు.అనంతరం నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కు,విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న ఏక్తామాల్ కు సంబంధించిన ప్రగతిని ప్రధానికి వివరించారు. ఈవీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా,ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు,కార్యదర్శులు కోన శశిధర్,డా.ఎన్.యువరాజ్,ఎపిఐఐసి ఎండి దినేష్ కుమార్,సిఆర్డిఏ అదనపు కమీషనర్ భార్గవ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా..

(మొదటి పేజి తరువాయి)

వివరాల్లోకి వెళితే, గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు.ం

# అర్నబ్ తుపానుతో ఇప్పటికే కుండపోత..

(మొదటి పేజి తరువాయి)

కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, రాయలసీమలో రాబోయే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

# పులివెందుల ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ సవాళ్లు

(మొదటి పేజి తరువాయి)

కడప జిల్లాలో, ముఖ్యంగా పులివెందులలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి పార్టీ ఎదుర్కొన్న పరాభవాన్ని జీర్ణించుకోలేక, పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టడానికే జగన్ ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. **"నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి కడపలో సీన్ రివర్స్ అయి తాను, తన పార్టీ 'పడక' ఎక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టే దురుద్దేశం ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైంది"** అని విమర్శించారు. దశాబ్దాలుగా తన కుటుంబం అనుసరించిన హింసా రాజకీయాలనే జగన్ కొనసాగించాలనుకుంటున్నారని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ల సమయంలో ప్యాలెస్‌కు పరిమితమై, విత్ డ్రాయల్స్ సమయంలో ముఖం చాటేసి, అన్నీ అయిపోయిన తర్వాత ఇప్పుడు చొక్కా మడతపెట్టడంలో ఆంతర్యం ఏమిటి?" అని సత్యకుమార్ నిలదీశారు. ఎన్నికలను వాయిదా వేయించడానికి జగన్ చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు అడ్డుకుందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జగన్ తనను తాను సంస్కరించుకుని, ప్రజాస్వామ్యవాదిగా మారే ప్రయత్నం చేయాలని హితవు పలికారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

(మొదటి పేజి తరువాయి)

నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరగనున్న ర్యాలీకి అండగా నిలుస్తామని వెల్లడించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేసింది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించింది. అయితే, తమ నేతలు కూడా ఇండియా కూటమి నేతలతో కలిసి ఆందోళనలో పాల్గొంటారా, లేదా అనే అంశంపై సీజేపీ స్పష్టత ఇవ్వలేదు. ప్రజలు తమ పాలకులను ఎన్నుకోవాలి కానీ, ఎవరెవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయించకూడదని సీజేపీ తన ప్రకటనలో పేర్కొంది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపింది. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని కోరింది. ఈ విషయంలో ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం తిరిగి కలగాలంటే జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కూడా సీజేపీ తన ప్రకటనలో ప్రస్తావించింది. కులం, మతం, లింగం, విద్య, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి వయోజనుడికి సమాన ఓటు హక్కు కల్పించడమే ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొంది.

## జడ్పిటిసి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బురానుద్దీన్ ను

# అభినందించిన మైనార్టీలు

బనగానపల్లె, అక్టోబర్ 28, పల్లెవెలుగు బనగానపల్లె జడ్పిటిసి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బురానుద్దీన్ ముస్లిం మైనార్టీ నాయకులు అభినందించారు. బుధవారం పట్టణంలో



జడ్పిటిసి సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపి పార్టీ సీనియర్ ముస్లిం మైనార్టీ నాయకులు బురానుద్దీన్ ను ముస్లిం మైనార్టీ నాయకులుఅల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లు మైనార్టీలను గుర్తుంచి జడ్పిటిసి పదవి ఏకగ్రీవంగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులుగా ఎన్నికైన బురానుద్దీన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు

## పలు వివాహ ముహూర్త కార్యక్రమాలకు హాజరయిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు బనగానపల్లె నియోజకవర్గం లో పలు వివాహ ముహూర్త కార్యక్రమాలకు హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

## శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానకు భక్తుల విరాళం



బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు కర్ణాటక రాష్ట్రం, బెంగులూరు వాస్తవ్యులు కీ”శే” వెంకట స్వామి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని విజయలక్ష్మి వారి కుమారుడు రంజిత్ వారి ధర్మపత్ని ప్రతిమ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ” చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

## యాగంటి కార్తీక మాస మహోత్సవా లకు

# బీసీ ఇందిరా రెడ్డి కీ ఆహ్వానం



బనగానపల్లె, అక్టోబర్ 28, పల్లెవెలుగు మండలం లోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానము నందు తేదీ.10.11.2026 నుండి 08. 12.2025 వరకు జరుగబోవు కార్తీకమాస ఉత్సవాల ఆహ్వాన పత్రికను బి.సి. ఇందిరా రెడ్డి కి అందజేసి ఆహ్వానించిన ఆలయ ఈఓ డి.పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి, సభ్యులు. ఈ కార్యక్రమము నందు ఆలయ సభ్యులు శ్రీరాములు, రామశేఖర్, రాజేష్, భరతుడు, సురేష్, లక్ష్మిరెడ్డి, గోపి, ఆదిరాజు, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ పాల్గొనడం జరిగినది.

## మహానంది మండలంలో45 మంది పై బైండోవర్

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని ఆయా గ్రామాల్లో 45 మందిని బైండోవర్ చేసినట్లు మహానంది ఎస్సై ఎల్.శివాజంల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

## కూటమి సంక్షేమ పథకాలే గెలుపు బాటలు:

# టీడీపీ జోరుగా ఇంటింటి ప్రచారం

**48వ వార్డులో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల తరపున ప్రచార హోరు**

**సైకిల్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి: నాయకుల పిలుపు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో “చెప్పాం...



చేస్తున్నాం...” అన్న నినాదంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కల్లూరు మండలం 48వ వార్డు పరిధిలోని ప్రియా హోమ్స్, వివిష్ణ టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో ఈ ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను, విశేష ప్రజాదరణ పొందుతున్న ‘సూపర్ సిక్స్’ విజయాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర సమగ్ర ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కర్నూలు కార్పొరేషన్‌పై పసుపు జెండా ఎగురవేయాలని, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషతో పాటు 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుతారు రాఘవేంద్ర, 49వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి. శివ పార్వతిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఈ ప్రచారంలో టీడీపీ యువ నాయకులు కె. శివ, 11వ క్లస్టర్ ఇంచార్జి జనార్దన్ ఆచారి, 48వ వార్డు ఇన్చార్జి నాగేశ్వర రావు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు గాంధీ, చిన్న మస్తాన్ భాషా, యం. కృష్ణ, పెద్ద మాధవస్వామి, బసవ రాజు, మధు, జగదీష్, సుంకాచారి, రాఘవేంద్ర, ఎన్టీఆర్ నగర్ సోమన్న, రఘు మెడికల్స్, విష్ణు, మహేష్, నూర్ అహ్మద్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి.

**-ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి.**

**-నగదు, మద్యం అక్రమ రవాణా, ఓటర్ల ప్రలోభాలపై నిఘా పెంచాలి.**

**-ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. శ్యామల.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. శ్యామల సూచించారు. ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రతి నిబంధనను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. బుధవారం నంద్యాల, బేతంచెర్ల, డోన్ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల వ్యయ పర్యవేక్షణకు సంబంధించి చేపట్టిన చర్యలను ఆమె పరిశీలించారు. ఎన్నికల వ్యయ నిబంధనల అమలును నిరంతరం పర్యవేక్షించాలని, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర వస్తువుల పంపిణీ జరగకుండా



కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. శ్యామల పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు.

**-జిల్లా వ్యాప్తంగా రహ్‌వీర్ పథకంపై విస్తృతంగా అవగాహన.**

**-రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు, ఆయా సబ్ డివిజన్ల పోలీస్ అధికారుల సూచనలతో జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్లు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో సంబంధిత పోలీస్ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రహ్‌వీర్ పథకంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అస్రార్ భాష నేడు రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు,యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు సకాలంలో సహాయం అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ఆసుపత్రికి చేసిన ఒక్కో రహవీర్ కు 25,000/- నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందించే అవకాశం ఉందని తెలిపారు. కావున అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాదం నుండి బాధితులకు సహాయం చేయడానికి భయపడకుండా, వెంటనే సంబంధిత అత్యవసర సేవలకు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని, కావున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తాము రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం -- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం -- ప్రాణాలను కాపాడుదాం అని తెలిపారు .



## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కర్నూలు త్రీ టౌన్ పరిధిలో
# పోలీసుల కవాతు (రూట్ మార్చ్)

**ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: డీఎస్పీ**

**అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**రూట్ మార్చ్‌లో పాల్గొన్న సుమారు 120 మంది పోలీస్ సిబ్బంది**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాబోయే మున్సిపల్



ఎన్నికల (నవంబర్ 1) నేపథ్యంలో కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు భారీ ఎత్తున



కవాతు (రూట్ మార్చ్) నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సీఐ పి. శేషయ్య, ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, షమీర్ బాషా, గోపీనాథ్, స్టేషన్ సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ బలగాలు సుమారు 120 మంది పాల్గొన్నారు. ఈ రూట్ మార్చ్ శ్రీరామ్ నగర్, గణేష్ నగర్, మాధవి నగర్, అరోరా నగర్, డాక్టర్స్ కాలనీ, బి-క్యాంప్, కమలా నగర్, ఎఫ్‌సీఐ (ఖీజ×) కాలనీ తదితర ప్రాంతాల మీదుగా సాగింది.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల రోజున ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వి ని యో గి ం చ ు కో వా ల ని సూచించారు. ప్రజల్లో భరోసా కల్పించేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు, అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# యాగంటి కార్తీక మాస మహోత్సవాలకు బీసీ రాజా రెడ్డికీ ఆహ్వానం



బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు మండలం లోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానము నందు తేదీ. 10.11.2026 నుండి తేదీ. 08.12.2026 వరకు జరుగబోవు కార్తీకమాస ఉత్సవాల ఆహ్వాన పత్రికను శ్రీ బి.సి. రాజారెడ్డి కి అందజేసి ఆహ్వానించిన ఆలయ ఈఓ డి.పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి, సభ్యులు. ఈ కార్యక్రమములో ఆలయ సభ్యులు శ్రీరాములు, రామశేఖర్, రాజేష్, భరతుడు, సురేష్, లక్ష్మిరెడ్డి, గోపి, ఆదిరాజు, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ పాల్గొనడం జరిగినది.

# చిన్నారి విద్యాభ్యాసానికి కలెక్టర్ అండ.

**ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కాకూడదు.**

**ప్రసన్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫీజు చెక్కు అందజేత.**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.కుటుంబ సభ్యులందరినీ కోల్పోయిన చిన్నారి గురులక్ష్మి ప్రసన్న విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అండగా నిలిచారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రసన్నకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కళాశాల ఫీజుకు సంబంధించిన చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు విద్యాభ్యాసానికి అడ్డంకి కాకూడదని, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రసన్నను సూచించారు. ఆమె విద్యాభ్యాసానికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో వర్షాల కారణంగా మట్టిమిద్దె కూలిన ఘటనలో కుటుంబ సభ్యులందరినీ కోల్పోయిన ప్రసన్నకు ప్రభుత్వం గతంలో రూ.10 లక్షల ఆర్థిక పరిహారం అందించింది. అప్పట్లో విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాస బాధ్యతను స్వీకరించిన కలెక్టర్, ఇప్పటికే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫీజును చెల్లించారు. తాజాగా ద్వితీయ సంవత్సరం ఫీజును కూడా అందజేశారు. ప్రథమ సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన ప్రసన్నను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యాభ్యాసానికి అండగా నిలిచిన జిల్లా కలెక్టర్‌కు ప్రసన్న కృతజ్ఞతలు తెలిపారు.

# ?సూపర్ సిక్స్ ఎక్కడ చంద్రబాబూ

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 28



ఎమ్మిగనూరు పట్టణం 16, 18, 42, 43, 44వ వార్డులు ఎన్నికల ముందు హామీల వర్షం.. ఇప్పుడు ఆ హామీల అమలుపై ప్రజల ప్రశ్నలు

నిత్యావసర ధరలు, నిరుద్యోగ సమస్యలు, ప్రజా సంక్షేమం, పట్టణంలోని మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై పాలకులను ప్రశ్నిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి అధ్యక్షతన, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ కె.ఎస్. రఘు తో కలిసి 16, 18, 42, 43, 44వ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల హామీల అమలు, వార్డుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలను కలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థులు

16వ వార్డు -- శివగంగ

18వ వార్డు -- జీకే లావణ్య

42వ వార్డు -- రిజ్వాన

43వ వార్డు -- కనిక శ్రీదేవి

44వ వార్డు -- ఇబ్రహీం

ప్రజలారా.. మీ ఓటు మీ హక్కు.. మీ వార్డు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

ఎన్నికల హామీలను ప్రశ్నించండి.. అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించండి.. ప్రజా సమస్యలపై స్పందించే నాయకత్వాన్ని గుర్తించండి. మీ అమూల్యమైన ఓటును బాధ్యతగా వినియోగించుకోండి.

ఫ్యాన్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

# ఎంపీటీసీ ఎన్నికల పోటీలో36 మంది అభ్యర్థులు.

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలం ఎంపీటీసీ ఎన్నికల పోటీలలో 36 మంది



అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నికల పోటీకి 59 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఉపసంహరణ లో భాగంగా23 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా పోటీలో 36 మంది అభ్యర్థులు నిలిచారన్నారు. వీరిలో వైసిపి 14 ,టిడిపి 14, జనసేన 6 ,బిజెపి 1, సిపిఐ 1 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 5 ఎన్నికలు 7 తేదీన ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు.

# రుద్రవరం మండలం అధ్యక్ష పీఠం ఎవరిని వరించేనో....?

**-వైసీపీ దా... ? టిడిపి దా...?**

**ఓటర్ ఎటువైపు మొగ్గు చూపుతారో....?**

**కూటమిలో రెబల్స్ తో టీడీపీకి నష్టం జరుగుతుందా....?**

**ఎన్నికల సమరంలో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు....**

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండల అధ్యక్ష పదవి ఎవరిని వరించేనో అన్న చర్చలు గ్రామాలలో మొదలయ్యాయి. నవంబర్ 5న జరగనున్న స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికలలో అధ్యక్ష పదవి మహిళా కోటాలో కేటాయించడంతో అధ్యక్ష పీఠం దక్కించుకునేందుకు టిడిపి, వైసిపి శ్రేణులు తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో మూడు దఫాలుగా పురుషులు అధ్యక్ష పదవి అనుభవించగా మూడు దఫాలుగా మహిళలు అధ్యక్ష పీఠం దక్కించుకున్నారు. ఈసారి కూడా అధ్యక్ష పీఠం మహిళలకు రిజర్వ్ కావడంతో అధ్యక్ష పీఠం దక్కించుకునేందుకు మహిళలు సిద్ధమయ్యారు. అయితే ఓటరు దేవుళ్ళ దయతో అధ్యక్ష పీఠం టిడిపి దక్కించుకుంటుందా లేక వైసీపీ దక్కించుకుంటుందా అనేది నవంబర్ 7వ తేదీన తేలనుంది. అధ్యక్ష పీఠం దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలైన అటు టిడిపి ఇటు వైఎస్ఆర్ సీపీ నాయకులు పావులు కదిపేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటున్నారు. మరి ఓటర్ దేవుళ్ళు ఎవరి వైపు మొగ్గు చూపుతారో వేచి చూడాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలలో రుద్రవరం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు ఒక జడ్పిటిసి స్థానానికి నవంబర్ 5వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

14 ఎంపీటీసీ స్థానాలకు కూటమి పార్టీలోని టిడిపి తరఫున 14 మంది అభ్యర్థులు, వైసీపీ తరఫున 14 మంది అభ్యర్థులు, కూటమి పార్టీలోని జనసేన తరఫున 6 మంది సిపిఐ 1 అభ్యర్థులు బిజెపి తరఫున 1 అభ్యర్థి ఎన్నికల బరిలో పోటీలో నిలిచారు.

ఎంపిటిసి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి నువ్వా నేనా అన్న



తీరుతో ఇప్పటికే ప్రచారాలు ప్రారంభించాయి. ఎన్నికలలో తామేమి తక్కువ కాదని తమ సత్తా నిరూపించుకునేందుకు జనసేన బిజెపి అభ్యర్థులు ప్రచారాన్ని మొదలుపెట్టారు. సిపిఐ కూడా తామేమీ తక్కువ కాదంటూ ఎన్నికల బరిలో నిలిచి ప్రచారం ప్రారంభించారు. గ్రామాలలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగితే ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవడం జరుగుతుందని అప్పుడే ఎవరి బలాలు ఏంటో తెలుస్తుందని గ్రామాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చేశామని సంక్షేమ పథకాలు అందించామని ఓటర్లను ప్రసన్నం చేసుకోనున్నారు. వైఎస్సార్ సీపీ తాము అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలు అభివృద్ధి చేయడమే కాకుండా పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించామని ఈసారి కూడా తమ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. మరోవైపు జనసేన బిజెపి కూటమి పంతానే కొనసాగిస్తూ తమ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. సిపిఐ కూడా తమకు ఒకసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను కోరుతున్నారు.

కూటమిలో రెబల్స్ తో టిడిపికి నష్టం జరుగుతుందా అన్న అనుమానాలు గ్రామాల్లో వ్యక్తం అవుతున్నాయి. కూటమి పార్టీలోని అధినాయకులు కూటమి పార్టీ అంతా ఒక్కటే అని ఒక వైపు చెబుతున్నా మరోవైపు ఎంపీటీసీ ఎన్నికలలో కూటమిలో రెబల్స్ తో టిడిపి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం నెలకొంది. కూటమిలో జనసేన బిజెపి తరఫున అభ్యర్థులు పోటీ చేయడంతో ఎన్నికలలో టిడిపి అభ్యర్థులకు కొంతమేర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు.

ఎన్నికల బరిలో నిలిచిన టిడిపికి చెందిన అభ్యర్థులతో పాటు నాయకులు వైసీపీకి చెందిన అభ్యర్థులతోపాటు నాయకులు ఓటర్ల నాడిని అంచనా వేసే పనిలో పడ్డారు. ఎలాగైనా గెలిచి అధ్యక్ష పీఠాన్ని దక్కించుకోవాలని ఇంటింటికి తిరిగి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. మరి ఓటర్లు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారా లేక ప్రతిపక్షానికి మొగ్గుచూపుతారా అన్నది నవంబర్ 7వ తేదీన తేటతెల్లమవుతుంది అంతవరకు వేచి చూడాల్సిందే.

# చిన్న కంబలూరు లో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి సుభద్ర ను గెలిపించాలని ప్రచారం.



రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని ఆయా గ్రామాలలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో పోటీ లో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. చిన్న కంబలూరు గ్రామంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి సుభద్రను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చారని తిరిగి వైసిపి అధికారం లోకి వస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అందువల్ల ప్రజలు వైసిపి అభ్యర్థిని గెలిపించి అభివృద్ధికి పాటుపడాలని నాయకులు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కాంతారెడ్డి, బాలిశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికలూ.. చట్టాలపై అవగాహన పెంచుకోండి!

### ఆపదలో భయపడొద్దు.. అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్

### బాలికలకు న్యాయవాది డి. శిల్ప పిలుపు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని,



ఆపద సమయంలో భయపడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ న్యాయవాది డి. శిల్ప పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి పి. విజయ ఆదేశాల మేరకు ఏ. క్యాంపులోని కార్పొరేషన్ హైస్కూల్‌లో 9వ తరగతి బాలికలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో 'లీగల్ అవేర్‌నెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది శిల్ప మాట్లాడుతూ.. బాలికల రక్షణకు చట్టాలు అండగా ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో చట్టం--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006లోని నిబంధనలు, నేరాలకు సంబంధించిన శిక్షలు, జరిమానాల గురించి వివరించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందించే ఐదు రకాల సేవలను తెలియజేశారు ఆపదలో ఉన్న బాలికలు, మహిళలు సమస్యలను చూసి కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. సమస్యలను పరిష్కరించుకునే మార్గాలను అన్వేషించాలని, ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని కోరారు. అవసరమైనప్పుడు 1098 లేదా 181 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించి సహాయం పొందాలని, సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. రోజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## యువత గొడవల్లో తలదూర్చవద్దు

మహానంది, పల్లె వెలుగు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చదువుకున్న యువత గొడవలకు వెళ్లితే పోలీసు కేసుల వుతాయని, దీని వల్ల భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందే



క్రమంలో ఇబ్బందులు పడుతారని మహానంది ఎస్ఐ ఎల్. శివాంజల్ హెచ్చరించారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ..ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి గొడవలు జరిగినా చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు.ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయని, యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంయమనం పాటించాలన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు యువత ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలే తప్ప అభివృద్ధి జరగలేదు...ఎంపీ బస్తిపాటి నాగరాజు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలే తప్ప ఎలాంటి అభివృద్ధి చెందలేదని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆరోపించారు...కార్పొరేషన్ పరిధిలోని 52 వ వార్డులో గల మామిదలపాడు, 51 వ వార్డులోని ఎల్.పేట లో కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరి తో కలిసి ఆయన మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేశారు..ఈ సందర్భంగా ఎంపీ ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ గొడ్డలి పార్టీ అరాచక పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందన్నారు.. ఇక గత ప్రభుత్వం కార్పొరేషన్ నిధులను మళ్ళించి వార్డుల అభివృద్ధిని గాలికి వదిలేసిందని, వార్డుల్లో అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కోరారు...ఈ కార్యక్రమంలో టీడీపీ మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, కార్పొరేటర్ అభ్యర్థులు రమేష్, ఓబులేసు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

### గోపిరెడ్డి జయమ్మకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు కోవెలకుంట్ల మండల పరిదిలోని కంపమల్ల వైయస్సార్ పార్టీ ఎంపిటిసి అభ్యర్థి ఎకగ్రీవంగా ఎన్నికైన గోపిరెడ్డి జయమ్మను బనగానపల్లె నియోజకవర్గం వైఎస్సార్ సీపీ మాజీ ఏమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు అనంతరం కాటసాని రామిరెడ్డి మాట్లాడుతు గ్రామ అభివృద్దికి కృషిచేయాలని అన్నారు ఎకగ్రీవంగా ఎన్నికైన ఎంపిటీసి గోపిరెడ్డి జయమ్మ ను కంపమల్ల మాజీ సర్పంచ్ సోముల లోకేశ్వరరెడ్డి వైసిపి నాయకులు సోముల వెంకటేశ్వరరెడ్డి సీనియర్ వైసిపి నాయకులు సోముల వెంకటరామిరెడ్డి మాజీ ఎంపిటిసి సుధాకరరెడ్డి జి జయన్న వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు



## ప్రతి వార్డులో అభివృద్ధి.. ప్రతి సమస్యకు పరిష్కారం..

# కూటమికే ప్రజల మద్దతు: మంత్రి టీజీ భరత్

**అభివృద్ధి అజెండాతో సైకిల్ యాత్ర చేపట్టిన మంత్రి టీజీ భరత్**

**28, 29, 31వ వార్డుల్లో కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం కొనసాగుతేనే కర్నూలు నగరంలో అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ భారీ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా 28, 29, 31 వార్డుల్లో సైకిల్ పై పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రెండేళ్ల నాలుగు నెలల్లో ఎన్నో ఏళ్ల సమస్యలకు పరిష్కారం

కూటమి ప్రభుత్వ రెండేళ్ల నాలుగు నెలల కాలంలో కర్నూలు నగరంలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను సైతం పరిష్కరించి ప్రజల మన్ననలు పొందామని పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సైకిల్ యాత్రలో భాగంగా 28వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి దానమ్మ, 29వ వార్డు అభ్యర్థి రమణమ్మ, 31వ వార్డు అభ్యర్థి ప్రవీణ్ కుమార్‌లకు మద్దతుగా మంత్రి టీజీ భరత్ ప్రచారం నిర్వహించారు. కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషతో పాటు ఆయా వార్డుల అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

**ఓర్వకల్లుకు భారీ పెట్టుబడులు.. యువతకు వేలాది ఉద్యోగాలు**

ఓర్వకల్లు ప్రాంతానికి రూ.50 వేల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చితే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పెట్టుబడుల రాకతో కర్నూలు జిల్లా రూపురేఖలు మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రిలయన్స్ కంపెనీ త్వరలో ప్రారంభం అవ్వనుందన్నారు. అంతేకాకుండా త్వరలో మరో రూ.7 వేల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. దీంతో వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

కర్నూలు అభివృద్ధి కొనసాగాలంటే కూటమిని గెలిపించండి

కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వార్డు వార్డులో రోడ్లు, కాల్వలు, త్రాగునీరు, విద్యుత్ స్తంభాల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తమ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను మంత్రి కోరారు.

## స్థానిక ఎన్నికల్లో టీడీపీ--కూటమి అభ్యర్థులను గెలిపించండి

**-ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.**

**-రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ గోపాల్.**

ఆదోని (పల్లె వెలుగు): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ--కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ గోపాల్ అన్నారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 38, 39వ వార్డుల్లో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పట్టణాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థలు ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వార్డుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థానిక సమస్యలను పరిష్కరించడం వంటి అంశాల్లో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ--కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, వార్డుల సమగ్ర అభివృద్ధికి సహకరించాలని గోపాల్ పిలుపునిచ్చారు.

ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్సింలు, లక్ష్మీనారాయణ, కురువ గోపాల్, కేపీ శ్రీనివాస్, గోపి తదితరులు పాల్గొన్నారు.





## బి.కోడూరులో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ ప్రచారం ప్రారంభం

**రామచంద్రపురంలో యంగల రత్నమ్మకు మద్దతుగా ఇంటింటి ప్రచారం**

బి.కోడూరు, 28 ( పల్లె వెలుగు ):బద్వేల్



నియోజకవర్గంలోని బి.కోడూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి యంగల రత్నమ్మ తన ఎన్నికల ప్రచారాన్ని రామచంద్రపురం గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ యువ నాయకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. జడ్పీటీసీ అభ్యర్థి యంగల రత్నమ్మకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ..

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లపాటు ప్రజలకు సంక్షేమ పాలన అందించారని పేర్కొన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు.

**ప్రజాసేవలో అనుభవం ఉన్న యంగల రత్నమ్మకు మద్దతివ్వండి**

యంగల రత్నమ్మ 2014లో పాయలకుంట్ల గ్రామ సర్పంచ్‌గా పనిచేసి ప్రజలకు సేవలందించారని దేవసాని ఆదిత్య రెడ్డి తెలిపారు. ఆమె భర్త యోగానంద రెడ్డి గత 12 సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీ బి.కోడూరు మండల కన్వీనర్‌గా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఈ కుటుంబానికి ప్రజలు మద్దతు తెలిపి, యంగల రత్నమ్మను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజ్ఞప్తి చేశారు.

# కల్లూరు అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ జోరుగా ఎన్నికల ప్రచారం

**41వ వార్డులో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి విస్తృత పర్యటన**
**ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు పాణ్యం మాజీ శాసనసభ్యులు కాటసాని



నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, రామభూపాల్ రెడ్డి 41వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వార్డు కార్పొరేటర్ అభ్యర్థి రామకృష్ణకు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి వార్డు పరిధిలోని ముజఫర్ నగర్, ఫారుక్ నగర్, మాదిరాజు నగర్, బీఆర్ రెడ్డి కాలనీలతో పాటు పందిపాడు గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతు కోరారు. రాబోయే ఎన్నికల్లో 41వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి రామకృష్ణను, నగర మేయర్ అభ్యర్థి సుశీలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డుల సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతోందని, సంక్షేమం--అభివృద్ధి కొనసాగాలంటే పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో 41వ వార్డుకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## వాలిపోతున్న విద్యుత్ స్తంభాలు..

# వేలాడుతున్న తీగలు

**ప్రమాదాలకు ఆహ్వానం.. పట్టించుకోని అధికారులు**



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని గాజులపల్లె, బసాపురం గ్రామాల్లో





విద్యుత్ స్తంభాలు,లైన్ల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకు వాలిపోతుండగా, చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. గాలివానలు, ఈదురుగాలులకు తీగలు తెగిపడి కిందపడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాలలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ఉండడంతో, పొలాల్లోకి వెళ్లి పనులు చేయాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని బెంబేలెత్తుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను సరి చేయాలని కోరుతున్నారు.వారి తప్పిదాలు మాత్రం ప్రజలు గుర్తుచేస్తున్నప్పటికీ విద్యుత్ అధికారులు మాత్రం కనికరం చూపెట్టడంలేదని వాపోతున్నారు .ఏ చిన్న ప్రమాదం జరిగినా ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ప్రజల, రైతుల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే



స్పందించి, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

# హెచ్ఐవీ నియంత్రణలో మొదటి రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో



హెచ్ఐవీ నియంత్రణకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఖకలెక్టర్ ఛాంబర్ లో ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలు, హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా మొదటి లక్ష్యమైన హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో తమ హెచ్ఐవీ స్థితిని తెలుసుకునే వారి శాతాన్ని పెంపొందించడం, రెండో ఋులక్ష్యమైన హెచ్ఐవీ బాధితులను ఏఆర్‌టీ చికిత్సకు అనుసంధానించి క్రమం తప్పకుండా కెమందులు వినియోగించేలా చూడటం అనే రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించి, పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మొదటి లక్ష్యం: 95 శాతం మందికి హెచ్ఐవీ స్థితిపై అవగాహన కల్పించాలి

హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మంది తమ హెచ్ఐవీ స్థితిని తెలుసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మొబైల్ ఐసీటీసీ వాహనాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, హెచ్ఐవీ ముప్పు అధికంగా ఉన్న వర్గాలను గుర్తించి పరీక్షల పరిధిని విస్తరించాలని సూచించారు. తద్వారా హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

రెండో లక్ష్యం: హెచ్ఐవీ బాధితుల్లో 95 శాతం మందిని ఏఆర్‌టీ చికిత్సకు అనుసంధానించాలి

హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మందిని ఏఆర్‌టీ కేంద్రాలకు అనుసంధానించి, వైద్యుల సూచనల మేరకు జీవితకాలం క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని త్వరితగతిన చికిత్స పరిధిలోకి తీసుకురావాలని, చికిత్సకు దూరమైన లాస్ట్ టు ఫాలోఅప్ కేసులను గుర్తించి తిరిగి చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నెలా ఫోన్ ద్వారా వారిని సంప్రదిస్తూ చికిత్స కొనసాగింపును పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

హెచ్ఐవీ బాధితుల జీవిత భాగస్వాములు, పిల్లలు, తల్లిదండ్రులు, ఇతర ప్రాథమిక సంబంధిత వ్యక్తులకు అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్ అందించాలని తెలిపారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, గత ఏడాది గణాంకాలతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రస్థాయి గణాంకాలను విశ్లేషించి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డా. శారదాబాయి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

# కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

మహానంది, పల్లె వెలుగు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి వేయించి గెలిపించండి అని





కూటమి అభ్యర్థిని పడకండ్ల శ్రీదేవి కోరారు. బుధవారం మహానంది మండలం ఆంజనేయపురం, బుచ్చమ్మ తోపులో గాజులపల్లె-2 ఎంపీటీసీ కూటమి అభ్యర్థిని శ్రీదేవితో పాటు భర్త, నాయకులు ఇంటింటికి తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బిజెపి పార్టీ కిషన్ మోర్చా రాష్ట్ర సీడ్స్ సేల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, రవి స్వామి, శశికళ కొండారెడ్డి, లక్ష్మీనారాయణ, రవికుమార్, విజయ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన అవసరం

**లి పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు**
**లి పోలింగ్ సామగ్రి స్వీకరణ, ఓటింగ్ నిర్వహణపై అధికారులకు అవగాహన**
**లి అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి



ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ పెట్టెల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించి, ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థనా మందిరాల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించే వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత ఎన్నికల ప్రచారానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేయర్ స్థాన రిటర్నింగ్ అధికారి, సెట్కూరు ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్, అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గడివేముల మండలంలోని జనసేన గర్జన

## ప్రజా పోరాటానికి నూతన ఆరంభం!



పల్లె వెలుగు దినపత్రిక గడివేముల గడివేముల మండలం లో జనసేన అభ్యర్థి ధరణి దివ్యవాణి, జడ్పిటిసి అభ్యర్థికి గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె భర్త చంద్రమోహన్ అభ్యర్థులతో జనసైనికులు కోసం మేము జెండాలు మోసే వాళ్లం కాదు... మార్పు కోసం చరిత్రను తిరగరాసే సైనికులం! అధికారం



కోసం కాదు ప్రజల ఆత్మగౌరవం కోసం మా పోరాటం! పదవుల కోసం కాదు అని ప్రజలతో జనసైనికుల ముందు ప్రచార కార్యక్రమాన్ని అటాహసంగా ప్రారంభించారు పేదవాడి కన్నీరు తుడవడం కోసం మా ప్రయాణం! అణగారిన గొంతుకలకు అండగా... ప్రజా సమస్యలపై పిడికిలి బిగించి... అవినీతి, అన్యాయాలపై అలుపెరగని పోరాటమే మా లక్ష్యం! గడివేముల మండలం ఆళ్లగడ్డ వీధుల్లో జనసేన అడుగులు పడితే... ప్రజా మార్పునకు నాంది పలికినట్టే! మా నినాదం ప్రజా సంక్షేమంమా విధానం ప్రజా సేవ మా ప్రయాణం సామాన్యుడి ఆత్మగౌరవం కోసం!

జనసేన ఒక పార్టీ మాత్రమే కాదు... ప్రశ్నించే గొంతుక! జనసేన ఒక జెండా మాత్రమే కాదు... మార్పు కోసం సాగించే ఉద్యమం! పోరాటమే మా బాట... ప్రజాసేవే మా లక్ష్యం! విధులు వెంట తిరుగుతూ ప్రచార కార్యక్రమాన్ని జనసైనికులతో అటాసంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరణి చంద్రమోహన్, నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వర రెడ్డి, అంకగళ్ల వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, ఫరుక్, కాటిపోగు వెంకటేశ్వర్లు, జన సైనికులు పాల్గొన్నారు.

## పపెసరవాయిగ్రామంలోఎంపీటీసీ ఎన్నికల ప్రచారం..

అభ్యర్థి కురువ మహాలక్ష్మి..గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ ప్రచారం..
టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి ఒడ్డు ప్రశాంతి.

పల్లె వెలుగు దినపత్రిక గడివేముల మండలం పెసరావయి గ్రామంలో ఎంపిటిసిగా పోటీ



చేస్తున్న కురువ మహాలక్ష్మి అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం గ్రామ టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి ఒడ్డు ప్రశాంతి టిడిపి,కార్యకర్తల ఆధ్వర్యంలో ఈరోజు టిడిపి తరఫున ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ  గ్రామంలో తిరుగుతూ ప్రచార కార్యక్రమాన్ని ఎంపిటిసి అభ్యర్థిని కురువ మహాలక్ష్మి జెడ్పిటిసి అభ్యర్థిని, ఎంపీపీ అనసూయమ్మను మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై ఓటు వేసిగెలిపించాలని ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## స్థానిక కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైస్సార్సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు  కర్నూలు  స్థానిక కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో



భాగంగా ఈ రోజు(28-10-2026) కర్నూలు టౌన్ లోని 10, 11, 63వ వార్డ్ లలో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న మేయర్, కార్పొరేటర్స్ అభ్యర్థులకు మద్దతుగా కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డిలి , కర్నూలు మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక  కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ గార్లతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని రాబోయే స్థానిక కార్పోరేషన్ ఎన్నికలలో వైయస్ ఆర్ సీపీ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించవలసినదిగా ఓటర్లను కోరిన వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మరియు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి..ం

## పుట్టినరోజు కు హాజరు అయి కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు బనగానపల్లె పట్టణం కొండపేట సయ్యద్ వాడి కాలనీ కి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త హబీబ్ కుమారుడు మొదటి సంవత్సర పుట్టినరోజు వేడుకలకు హాజరు అయి కేక్ కట్ చేసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

## మున్సిపల్ ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

ఫారం 10ఏ తో పాటు డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డు సమర్పించాలి.
పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్దేశిత నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. ఈ మేరకు బుధవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆమె పరిశీలించారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకునే ఉద్యోగులు ఫారం 10ఏ తో పాటు డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఓటు వేసే విధానానికి సంబంధించిన సూచనలను పొంది, నిర్దేశిత ప్రక్రియను అనుసరించి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.బ్యాలెట్ పత్రాన్ని నిర్దేశించిన చిన్న కవరులో ఉంచి, ధ్రువీకరించిన ఫారాన్ని బయట ఉంచి, ఈ రెండింటినీ పెద్ద కవరులో పెట్టి సమర్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం కవర్లను సక్రమంగా సమర్పించినప్పుడే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు పరిగణనలోకి వస్తాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, ప్రతి ఓటరు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## జిల్లాను ఉపాధి హామీ పథకం అమలులో ముందంజలో నిలపాలి.

**-ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలి**
**-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.**
**-ఉపాధి హామీ పథకం లక్ష్యాల సాధనకు పంచాయతీ వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి . పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం. శివప్రసాద్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలును మరింత వేగవంతం చేసి, కూలీలకు గరిష్ఠంగా పని దినాలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.

బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా వేతనాలు, మెటీరియల్ వ్యయాలపై జిల్లా స్థాయి సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం. శివప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక తో కలిసి జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం కనీసం 100 రోజుల పని కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని 28 మండలాలకు గాను 27 మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించబడినప్పటికీ, ఉపాధి పనులకు కూలీల హాజరు ఆశించిన స్థాయిలో లేదని హాజరు శాతాన్ని పెంచాలన్నారు. రోజువారీ కూలి రూ.307 నుంచి రూ.312కు పెరిగిన నేపథ్యంలో, కూలీలకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి పనుల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. కూలీల హాజరు తక్కువగా ఉండటం వల్ల ఉపాధి అవకాశాలను                    పూర్తిస్థాయిలో  ఇప్పటివరకు సుమారు 2 లక్షల కుటుంబాలకు




వినియోగించుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలను ప్రోత్సహించాలని, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా రోజువారీ, వారంవారీ ప్రణాళికలు రూపొందించాలని, గ్రామ సచివాలయాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి ఉపాధి పనుల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. సమష్టి కృషితో నంద్యాల జిల్లాను ఉపాధి హామీ పథకం అమలులో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు మరింత ఉపాధి కల్పించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. మార్గదర్శకాల ప్రకారం ఉపాధి పనిదినాల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని అన్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 76 శాతం ప్రగతి సాధించగా, 1.65 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే ఉపాధి కల్పించగా, మరో 35 వేల కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సి ఉందని వివరించారు. గత ఏడాది 2.82 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించగా, ప్రస్తుత ఏడాది మాత్రమే ఉపాధి అందిందని, మిగిలిన కుటుంబాలకు కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది సాధించిన ప్రగతిని ప్రాతిపదికగా తీసుకుని, సవరించిన పనిదినాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కరువు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అదనపు ఉపాధి అవకాశాలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని మండలాల్లో కూలీలకు లభిస్తున్న రోజువారీ వేతనాలు తక్కువగా ఉండటం వల్ల పనుల పట్ల ఆసక్తి తగ్గుతున్నట్లు తెలిపారు. సుమారు రూ.242 నుంచి రూ.312 వరకు వేతనాల్లో వ్యత్యాసాలు ఉన్నందున, తక్కువ వేతనాలు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

ప్రతి పంచాయతీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూలీల హాజరును పెంచడంతో పాటు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో డ్వామా పిడి సూర్యనారాయణ, ఏపీడీలు, ఏపీవోలు, జేఈలు, ఈసీలు, టీఏలు, బీఎఫ్‌టీలతో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు చెందిన ఏఈలు, డీఈలు, ఈఈలు పాల్గొననున్నారు.

## మంత్రి  ఇన్నేళ్ల రాజకీయ ప్రస్థానంలో నంద్యాల ప్రజలకు ఒక్క సేవా కార్యక్రమం అన్న చేశారా.

**స్కీములు మరిచారు స్కాములు చేస్తున్నారు .**
**నంద్యాలలో వైసీపీ అభ్యర్థుల తరపున మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.  నంద్యాల స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వైసీపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 45వ వార్డు వైసీపీ అభ్యర్థి షేక్ సతాజ్, 9వ వార్డు అభ్యర్థి అంకాలమ్మ, 10వ వార్డు అభ్యర్థి దండే సుధాకర్, 44వ వార్డు అభ్యర్థి సోహెల్ రానా, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి దాల్ మిల్ అమీర్ బాషా గెలుపు కోసం ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డుల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ "ఇన్ని సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నంద్యాల ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు ఏంటి?" అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఎంతవరకు అమలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నంద్యాల అభివృద్ధి, వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టే పనులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

నవంబర్ ఒకటో తేదీ జరగనున్న ఎలక్షన్లలో వైసిపి అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు .

వైసీపీ అభ్యర్థుల తరపున నిర్వహించిన ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు



నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని అథెనా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం (రిసెప్షన్ సెంటర్), ఓట్ల లెక్కింపు హాల్, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 1న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కేంద్రం పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి వాహనాలు సులభంగా బయటకు వెళ్లేందుకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 145 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల విధుల్లో పాల్గొనే 820 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లలో ఇప్పటికే నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, నరేష్, శ్రీనివాసన్, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలి
-అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై నిరంతర పర్యవేక్షణ
-జోనల్ అధికారులకు దిశానిర్దేశం చేసిన అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జోనల్ అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో జోనల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జోనల్ అధికారులకు కేటాయించిన వార్డుల్లో క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ఎన్నికల నియమావళి అమలును పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా చూడటంలో జోనల్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం పోలింగ్ ప్రక్రియలో భాగంగా బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించి, అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలి.

పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి.
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ నేడు నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ వద్దగల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం, చిన్మయ స్కూల్, నడిగడ్డ, తెలుగు పేట, గాంధీ పురపాలక పాఠశాల హరిజనవాడ, వివేకవర్ధిని పురపాలక ప్రాథమిక పాఠశాల బయటిపేట, కోట పురపాలక ప్రాథమిక పాఠశాల ఆత్మకూరు బస్టాండ్ , మున్సిపల్ హై స్కూల్ గుర్రాలపేట, పివి నగర్ వైయస్ నగర్ నందమూరి నగర్, ఎస్పీజీ స్కూల్, దేవనగర్ నందుగల పురపాలక ప్రాథమిక పాఠశాల, మొదలగు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ, పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టాలని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఓటర్లు ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు.
మున్సిపల్ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ బాషా , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఇన్స్పెక్టర్లు మల్లికార్జున గుప్తా ,రామాంజనేయుడు , ఇస్మాయిల్ ,సుధాకర్ రెడ్డి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

# ప్రచారానికి తెరలేపిన వైసిపి

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 28: బండి ఆత్మకూరు మండలంలో ఎన్నికల ప్రచారానికి తెరలేచింది. వైఎస్ఆర్ పార్టీ తరపున జడ్పిటిసి స్థానానికి అభ్యర్థిగా పోటీ చేస్తున్న దేసు వెంకటరామిరెడ్డి బుధవారం సాయంత్రం బండి ఆత్మకూరులో ఎన్నికల ప్రచారానికి తెర లేపారు. ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టి వైఎస్ఆర్ పార్టీకి మద్దతు ప్రకటించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. బండి ఆత్మకూరు వన్ నుండి వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీమ మాధవరెడ్డి కూడా జడ్పిటిసి అభ్యర్థి దేసు తో జత కలిశారు. ప్రజలు తమకు ఓట్లు వేసి గెలిపించాలని చేతులెత్తి మొక్కుతున్నారు. మరోవైపు బండి ఆత్మకూరు రెండు స్థానం నుండి వైఎస్ఆర్ అభ్యర్థిగా బియ్య గారి షేక్ రుక్సానా గ్రామంలోని కొత్త కొట్టాల కాలనీలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రుక్సాన తరపున ఆమె తరపు బంధువులు కుటుంబ సభ్యులు వైయస్సార్ పార్టీ అభిమానులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనార్టీలు బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలందరూ తమకు మద్దతు తెలిపి, తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కడమల కాలువ గ్రామంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు
మరోవైపు వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారాన్ని నిర్వహించేందుకు మాజీ శాసనసభ్యుడు చక్రపాణి రెడ్డి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. గురువారం కడమల కాల్వ , బి కోడూరు సింగవరం సోమయాజుల పల్లె గ్రామాలలోని పార్టీ కార్యకర్తలు నాయకులతో ఈర్నపాడు గ్రామంలో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. గురువారం సాయంత్రం నారాయణపురం చిన్నదేవలాపురం పెద్దదేవలాపురం పరమటూరు గ్రామాలలోని పార్టీ కార్యకర్తలతో కలిపి సంత జుటూరు గ్రామంలో సమావేశాన్ని నిర్వహించేందుకు పూనుకుంటున్నారు.





## మహానందిలో వసతి గదుల నిర్మాణానికి విరాళం



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వర సదనంలో ఒక డీలక్స్ గది నిర్మాణానికి భక్తులు విరాళం అందజేసినట్లు ఏఈవో మధు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ కు చెందిన కంచి లక్ష్మీనారాయణ రెడ్డి, కాంతి దంపతులు రూ.10 లక్షలు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. మొదటి విడతగా రూ.1 లక్ష అందజేశారన్నారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు

## యాగంటి కార్తీక మాస మహోత్సవాలకు మంత్రి బీసీ కి ఆహ్వానం



బనగానపల్లె, అక్టోబర్ 28,పల్లెవెలుగు ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహించనున్న కార్తీక మాస మహోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి. పాండురంగారెడ్డి ఆహ్వానించారు. బుధవారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి ,ఈవో పాండురంగారెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి కార్తీక మాస మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. యాగంటి క్షేత్రంలో నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు కార్తీక మాస మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్తీక మాస మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, భద్రత, రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యాగంటి క్షేత్రంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. పనుల వివరాలు, పురోగతి, పూర్తయ్యే గడువుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. మహోత్సవాల్లో భాగంగా శ్రీ ఉమామహేశ్వర స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, సహస్రనామావళి, పల్లకి సేవోత్సవం నిర్వహించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్తీక మాసంలో యాగంటి క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి సేవలో పాల్గొని ఆశీస్సులు పొందాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పి శ్రీరాములు, రామశేఖర్ యాదవ్, జక్కుల సురేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పిటిసి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బురానుద్దీన్ ను
# అభినందించిన మైనార్టీలు



బనగానపల్లె, అక్టోబర్ 28, పల్లెవెలుగు బనగానపల్లె జడ్పిటిసి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బురానుద్దీన్ ముస్లిం మైనార్టీ నాయకులు అభినందించారు. బుధవారం పట్టణంలో జడ్పిటిసి సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపి పార్టీ సీనియర్ ముస్లిం మైనార్టీ నాయకులు బురానుద్దీన్ ను ముస్లిం మైనార్టీ నాయకులుఅల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లు మైనార్టీలను గుర్తుంచి జడ్పిటిసి పదవి ఏకగ్రీవంగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులుగా ఎన్నికైన బురానుద్దీన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు

# అర్నబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

126.165 కి.మీ మేర ఆర్అండ్‌బీ రహదారులకు నష్టం- మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబర్ 28, పల్లెవెలుగు అర్నబ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కాన్ఫరెన్స్ ద్వారా తుఫానుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం ప్రారంభమైనప్పటి నుంచి ఆర్అండ్‌బీ శాఖ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఎక్కడికక్కడ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 126.165 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారి ఉపరితలం దెబ్బతిన్నట్లు తెలిపారు . తొమ్మిది చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతినగా, రెండు చోట్ల స్కోర్లు, ఒక చోట బ్రీచ్ ఏర్పడినట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రతకు ఆర్అండ్‌బీ రహదారులపై 1,058 చెట్లు కూలిపోగా, ఇప్పటికే 859 చెట్లను తొలగించినట్లు తెలిపారు. మొత్తం 57 చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, 20 చోట్ల ట్రాఫిక్‌ను పునరుద్ధరించామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ రహదారులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది, యంత్రాంగం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు.
తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణకు రూ.59.4486 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. తాత్కాలిక పునరుద్ధరణ పనులకు రూ.9.1756 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.50.273 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. జిల్లాల వారీగా తూర్పుగోదావరిలో రూ.29.4212 కోట్లు, శ్రీకాకుళంలో రూ.24.943 కోట్లు, విజయనగరంలో రూ.4.2214 కోట్లు, పార్వతీపురం మన్యంలో రూ.0.863 కోట్లు మేర పునరుద్ధరణ పనులు అవసరమని ప్రాథమిక అంచనాలు అందినట్లు తెలిపారు. ప్రజల భద్రతే అత్యంత ప్రాధాన్యమని, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలు, కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనలు, దెబ్బతిన్న రహదారుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట్ల బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలని, రహదారులపై ఎక్కడైనా చెట్లు పడినా, కోతలు ఏర్పడినా, రాకపోకలకు అంతరాయం కలిగినా తక్షణమే స్పందించాలన్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ రహదారి కనెక్టివిటీని వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని మంత్రి స్పష్టం చేశారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తుగానే రాష్ట్రవ్యాప్తంగా 53 కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసి 57 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 614 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 550 జేసీబీలు, 596 పవర్ సాలు సిద్ధంగా ఉంచడంతో పాటు 78 ప్రాంతాల్లో అవసరమైన సిబ్బంది, యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తున్నాయని తెలిపారు.




Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: PalleveluguneWs9@gmail.com